సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



వైభవంగా రాములగుట్ట జాతర

తాంసి మండలం పాలోది శివారులో నిర్వహిస్తున్న రాములగుట్ట జాతర ఆదివారం వైభవంగా ముగిసింది. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. 9లో▸



ఏజెన్సీలో జననీ నిరీక్షణ కేంద్రాలు

ఏజెన్సీ ప్రాంతాల్లో గర్భిణుల సంరక్షణ కోసం ఐటీడీఏ చర్యలు చేపడుతోంది. ఈమేరకు జననీ నిరీక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0/13.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రివేళలో, వేకువజామున చలితీవ్రత పెరగనుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఎన్‌సీసీ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్‌సీసీ ఏ–గ్రేడ్ సర్టిఫికెట్ కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 850 మంది కేడెట్లు హాజరయ్యారు. అబ్జర్వర్ పినాకి బానిక్ పరీక్ష తీరును పరిశీలించారు. పదో తరగతి కేడెట్లకు ఏ– సర్టిఫికెట్, ఇంటర్ వారికి బి–సర్టిఫికెట్, డిగ్రీ వారికి సి–సర్టిఫికెట్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

తొమ్మిదో రోజుకు స్టాఫ్ నర్సుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న స్టాఫ్ నర్సులు

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ ఎదుట స్టాఫ్‌నర్సులు చేపడుతున్న సమ్మె ఆదివారంతో తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు స్టాఫ్ నర్సులు మాట్లాడుతూ, ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఇందులో స్టాఫ్‌నర్సులు వసంతరాణి, రాజ్యలక్ష్మి, జయ, వనజ, సునీత, కృష్ణకుమారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

ఆదిలాబాద్‌రూరల్: ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చందాల రాజన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ హౌసింగ్ బోర్డులో గల సంఘ భవన స్థలంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సంఘ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘ భవనం కేసు కోర్టులో ఉందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో స్థలం వచ్చిందని, భవన నిర్మాణం కూడా త్వరలోనే పూర్తి చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వెల్లడించారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగన్న, అశోక్, దేవిదాస్, ప్రభాకర్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న జాతర



ఆలయం వద్ద భక్తుల సందడి

నేరడిగొండ: మండల కేంద్రంతో పాటు పెద్ద బుగ్గారం, కుమారి గ్రామాల్లో భీమన్న జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆయా ఆలయాల వద్ద సందడి కనిపించింది. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

12న 'చలో బంజారా భవన్'



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

నార్నూర్: లంబాడా ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టనున్న చలో బంజారాభవన్‌కు సంబంధించిన కరపత్రంను వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జాదవ్ వసంత్‌రావు ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ తండా నుంచి లంబాడాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ సుధాకర్, విద్యారాణి, నరహరిదాస్ తదితరులు పాల్గొన్నారు.



జైనథ్ మండలంలో ఈ యాసంగిలో సాగవుతున్న పత్తి పంట

యాసంగిలోనూ పత్తి



“ ఇక్కడ కనిపిస్తున్నది జైనథ్ మండలం ఆకుర్ల గ్రామానికి చెందిన రైతు దివాకర్. ఈయనకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. గతేడాది యాసంగిలో మంచిర్యాలలో కొందరు పత్తి సాగు చేయగా మంచి దిగుబడి వచ్చిందని బంధువుల ద్వారా తెలుసుకున్నాడు. తాను కూడా ఈ యాసంగిలో పత్తి సాగుకు మొగ్గు చూపాడు. రెండెకరాల్లో పత్తి, మూడెకరాల్లో శనగ వేశాడు. ప్రస్తుతం పంట బార్‌కాత దశలో ఉందని, చెట్టుకు ఏడు నుంచి ఎనిమిది కాయలు ఉన్నాయని చెబుతున్నాడు. ఇతనొక్కడే కాదు.. జిల్లాలో మరికొందరు రైతులు ఈ యాసంగిలో పత్తి సాగును ప్రయోగాత్మకంగా చేపట్టారు.

- జిల్లాలో ప్రయోగాత్మకంగా 25 ఎకరాల్లో సాగు
- పూత, కాత దశలో పంట
- ధర ఉంటేనే మేలంటున్న శాస్త్రవేత్తలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఏటా వానాకాలంలో పత్తి సాగవుతుంటుంది. అయితే ప్రకృతి వైపరీత్యాల కారణంగా సరైన దిగుబడి రాక, గిట్టుబాటు ధర లేకరైతులు నష్టపోతున్నారు. జూన్‌లో విత్తనాలు విత్తుకుంటే సకాలంలో వర్షాలు కురువక కొన్నిసార్లు, మరికొన్ని సందర్భాల్లో అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్న ఘటనలూ ఉన్నాయి. దీనికి తోడు సీజన్ మొదట్లో పత్తికి ధర తక్కువగా ఉండటం, రైతులు మార్కెట్‌లో దిగుబడిని విక్రయించిన తర్వాత పెరుగుతుండడం షరామామూలుగా మారింది. గతేడాది ఫిబ్రవరి, మార్చిలో పత్తి క్వింటాలు ధర రూ.10వేల వరకు పలికింది. మొదట్లో రూ.8వేలు ఉండగా, చివరిలో అధిక ధర ఉన్నా రైతుల వద్ద పత్తి లేకపోవడంతో నష్టపోయారు. మార్చి తర్వాత పత్తికి మార్కెట్‌లో అధిక ధర పలుకుతుండటంతో దీన్ని లాభసాటిగా మార్చుకోవచ్చనే వ్యవసాయ అధికారుల సూచన మేరకు కొంతమంది రైతులు ఈ సారి యాసంగిలో పత్తి సాగును ప్రయోగాత్మకంగా చేపట్టారు. ప్రస్తుతం పంట పూత, కాత దశలో ఉంది.

యాసంగిలో ఇలా..

జిల్లాలో యాసంగి సాగు విస్తీర్ణం లక్ష 3వేల ఎకరాలు. ఈ సారి రైతులు లక్ష 51వేల 182 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఇందులో ఏటా మాదిరిగా అత్యధికంగా శనగ లక్ష 5వేల ఎకరాల్లో శనగ సాగవుతుంది. అలాగే 25వేల ఎకరాల్లో జొన్న, 13,500 ఎకరాల్లో మక్క, 2,800 ఎకరాల్లో గోధుమ, 160 ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో సోయా సాగు చేస్తున్నారు. అయితే ఇందులో గతానికి భిన్నంగా 25 ఎకరాల్లో పత్తిని ప్రత్యేకంగా ఈ సీజన్‌లో సాగు చేస్తుండటం గమనార్హం.

యాసంగిలో పంట ప్రయోగం..

రైతులు యాసంగిలో పంట ప్రయోగం చేస్తున్నారు. రెండు, మూడెకరాల్లో రొటీన్‌కు భిన్న పంటలు సాగు చేసి దిగుబడి బాగా వస్తే మరోసారి అధిక మొత్తంలో సాగుకు సన్నద్ధమవుతున్నారు. గతేడాది యాసంగిలో శనగకు బదులు సోయా, కందులు సాగు చేశారు. ఈ ఏడాది పత్తి వేశారు. గతేడాది పత్తికి ధర అధికంగా ఉండటం, చివరలో అనుకున్న రేటుకు మించి పలకడంతో కొంతమంది ఈ సాగుకు ముందుకొచ్చారు. ఆదిలాబాద్‌రూరల్, జైనథ్, బేల తదితర మండలాల్లో కొంతమంది రైతులు ఎకరం నుంచి నాలుగు ఎకరాల్లోపు పత్తి సాగు చేస్తున్నారు. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం 25 ఎకరాల్లో పత్తి సాగవుతుందని చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్‌ల్లో పంట చేతికొస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. శాస్త్రవేత్తలు మాత్రం ధర అధికంగా ఉంటేనే మేలని, లేకపోతే నష్టపోయే పరిస్థితులు ఉంటాయని అంటున్నారు. సోయా పంట తీసిన తర్వాత సెప్టెంబర్, అక్టోబర్‌లో పత్తిని సాగు చేశారు. అయితే దిగుబడి ఏ విధంగా ఉంటుందో పంట చేతికొచ్చిన తర్వాత తెలుస్తుంది.

ప్రత్యామ్నాయ పంటల సాగు మేలు



రైతులు యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడం మేలు. అధిక దిగుబడినిచ్చే పంటలు వేసుకుంటే ఆర్థికంగా లబ్ధి పొందవచ్చు. ఈ సీజన్‌లో పత్తిని సాగు చేస్తే ధర ఉంటేనే మేలు. లేకుంటే రైతులు నష్టపోవాల్సి వస్తుంది. గతేడాది ధర ఎక్కువగా ఉండే. ప్రస్తుతం తక్కువగా ఉంది. అలాగే వానాకాలంతో పోల్చితే యాసంగిలో దిగుబడి ఎక్కువగా రాదు.

– శ్రీధర్ చౌహాన్, ప్రధాన శాస్త్రవేత్త, ఏఆర్ఎస్

రైతులకు సలహాలు ఇస్తున్నాం..

ట్రయల్‌గా కొంతమంది రైతులు యాసంగిలో పత్తి సాగు చేశారు. వారికి టెక్నికల్‌గా సలహాలు అందజేస్తున్నా. పంట క్షేత్రాలను ఎప్పటికప్పుడు సందర్శిస్తున్నా. ప్రస్తుతం అయితే పంట బాగానే ఉంది. గతేడాది కందులు, సోయా, పచ్చజొన్న వేశారు. దిగుబడి బాగానే వచ్చింది. సోయా సీడ్ కోసం ఉపయోగపడుతుంది. ఈ ఏడాది యాసంగి దిగుబడి ఎలా ఉంటుందో చూడాలి.

– వివేక్, వ్యవసాయ అధికారి, జైనథ్

ధర ఉంటేనే మేలు..

యాసంగిలో పత్తి అంత అనుకూలంగా ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గతేడాది పత్తికి ధర ఉండడంతో రైతులు ఈ సీజన్‌లో వేశారని, ప్రస్తుతం చలి ప్రభావంతో మొక్కలు పెరగడం లేదంటున్నారు. ధర అధికంగా ఉన్నప్పుడు ఈ పంట వేసుకుంటే ప్రయోజనమేనని, అయితే దిగుబడి ఆశాజనకంగా ఉండకపోవచ్చని అభిప్రాయ పడుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలైన ఆవాలు, కుసుమ, జొన్న, మొక్కజొన్న, గోదుమ, పొద్దుతిరుగుడు, పప్పుదినుసులు సాగు చేస్తే మేలని సూచిస్తున్నారు. అయితే జిల్లాలో పత్తి, సోయా, కంది పంటలకు తప్పా మిగతా వాటికి మార్కెట్ లేదు. అధిక మొత్తంలో సాగు చేస్తే పంటను ఇతర జిల్లాలకు వెళ్లి విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్ లింక్ వేగవంతం



ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న బీఎల్‌వో

- ఓటరుకార్డుకు 81.39శాతం అనుసంధానం
- సిరికొండ టాప్.. ఆదిలాబాద్‌అర్బన్ లాస్ట్
- పలు గ్రామాల్లో వందశాతం
- పారదర్శక ఓటరు జాబితాకు ఉపయుక్తం

జిల్లాలో ..
ఓటర్లు : 4,26,096
పోలింగ్ కేంద్రాలు: 582
ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం పూర్తి : 3,46,802
ఇంకా అనుసంధానం కావాల్సింది : 79,294

కైలాస్‌నగర్: పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. గతేడాది ఆగస్టు 1న ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటివరకు జిల్లాలో 81.39 శా తం మంది ఓటర్లు తమ ఆధార్‌ను ఓటర్‌కార్డుకు లింక్ చేసుకున్నారు. ఆధార్ నమోదు ఐచ్ఛికమే అ యినా ఓటర్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ వి వరాలు నమోదు చేసుకుంటున్నారు. సిరికొండ మండలం జిల్లాలో అగ్రస్థానంలో నిలువగా ఆదిలాబాద్ అర్బన్ చివరన ఉంది. పలు గ్రామాలు వందశాతం నమోదు చేయగా పట్టణంలోని పలు కాలనీల్లో ఇప్పటికి 35శాతం దాటకపోవడం గమనార్హం.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఇప్పటివరకు 3,46,802 మంది ఓటర్లు తమ ఎపిక్‌కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేసుకున్నారు.

- బోథ్ నియోజకవర్గంలో 2,01,034 మంది ఓటర్లకు గాను 1,80,151మంది ఆధార్‌తో లింక్ చేసుకున్నారు. 81.39శాతం పూర్తయింది. ఇంకా 20,883 మంది నమోదు చేసుకోవాల్సి ఉంది.
- ఆదిలాబాద్ నియోజకవర్గంలో 2,25,062 మంది ఓటర్లుండగా ఇప్పటివరకు 1,66,651మంది ఆధార్ అనుసంధానం పూర్తి చేసుకున్నారు. 74.05 శాతం పూర్తయింది. ఇంకా 58,411 మంది అనుసంధానం చేసుకో వాల్సి ఉంది. ఎపిక్‌కార్డుకు ఆధార్ అనుసంధానం ద్వారా డబుల్ ఓటర్లను తొలగించవచ్చు. ఎలాంటి పొరపాట్లకు తావులేని పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి దోహదపడనుంది.

టాప్‌లో సిరికొండ..

ఎపిక్‌కు ఆధార్ అనుసంధానం చేయడంలో సిరికొండ మండలం అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈ మండలంలో 96.02శాతం మంది ఓటర్లు తమ ఆధార్‌ను అనుసంధానం చేసుకున్నారు. ఆదిలాబాద్ అర్బన్ మండలం ఈ ప్రక్రియలో వెనుకబడి ఉంది. ఇప్పటివరకు కేవలం 63.61 శాతం మాత్రమే నమోదైంది. నిరక్షరాస్యులుండే గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ వేగంగా సాగుతుంది. జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ 100.61శాతం, ముక్తాపూర్ 102.88, బెల్లూరిలో 101.10, బేల మండలం సాంగిడిలో 100, ఆదిలాబాద్ రూరల్ మండలం లోకారిలో 100, కచ్‌కంటి 101.03, కుంభజరి 100.69శాతంతో ఈ గ్రామాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. విద్యావంతులుండే ఆదిలాబాద్ పట్టణంలో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. రిక్షాకాలనీలో 32.15, విద్యానగర్‌లో కేవలం 27.47శాతం, భాగ్యనగర్‌లో 27.59 శాతం మాత్రమే ఉండటం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతుంది. అర్బన్ మండల రెవెన్యూ యంత్రాంగం ఈ ప్రక్రియపై అంతగా దృష్టిసారించడంలేదు. దీంతో పలు కాలనీల్లో 50శాతంలోపే నమోదవడం గమనార్హం.

ఆన్‌లైన్‌పై కనిపించని ఆసక్తి..

ఫారం 6–బి ద్వారా ఆధార్ అనుసంధానంకు ఆన్‌లైన్‌లోనూ అవకాశం కల్పించారు. అయితే జిల్లాలో అందిన దరఖాస్తులను పరిశీలిస్తే దీనిపై ఓటర్లు అంతగా ఆసక్తి చూపనట్లు తెలుస్తోంది. అవగాహన రాహిత్యం, సరైన ప్రచారం లేకపోవడం వంటి కారణాలతో ఓటర్లు ఆన్‌లైన్ దరఖాస్తుకు ముందుకు రానట్లుగా అవగతమవుతుంది. జిల్లాలో 4లక్షలకు పైబడి ఓటర్లుండగా ఆన్‌లైన్‌లో కేవలం 680మంది మాత్రమే అనుసంధానం చేసుకోవడం గమనార్హం. నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్‌లో 97మంది, ఓటరు పోర్టల్‌లో 110 మంది, వీహెచ్ఏ పోర్టల్‌లో 473 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఈ వెబ్‌సైట్లపై తగు ప్రచారం కల్పించినట్లైతే పట్టణ ప్రాంతంలో ప్రక్రియ వేగమయ్యే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అలాగే బీఎల్‌వోలు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించగా గరుడ యాప్‌లో 26,5006, ఈఆర్‌వో నెట్‌లో 81,116 మంది ఓటర్ల ఆధార్‌ను నమోదు చేశారు.

బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

- టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం

ఆదిలాబాద్‌టౌన్: సీనియారిటీ జాబితాను నిబంధనల ప్రకారం రూపొందించి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం అన్నారు. జిల్లాకేంద్రంలోని స్థానిక సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎనిమిదేళ్ల తర్వాత పదోన్నతుల ప్రక్రియ చేపడుతున్నందున అర్హులకు న్యాయం చేయాలని కోరారు. జీరో సర్వీసు ఉపాధ్యాయులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు లేదా అంతకంటే ఎక్కువ పదోన్నతులకు అర్హత కలిగిన ఉపాధ్యాయులను ఒకే పదోన్నతికి పరిమితం చేయడం సరికాదన్నారు. అప్‌గ్రేడ్ చేసిన పండిత, పీఈటీ పోస్టులతో పాటు అన్ని భాషల స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలన్నారు. పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి పదోన్నతుల ద్వారా ఈ షెడ్యూల్లోనే భర్తీ చేయాలన్నారు. పర్యవేక్షణ పోస్టులైన ఎంఈవో, డైట్ లెక్చరర్ పోస్టులకు కూడా పదోన్నతులు కల్పించాలన్నారు. అంతకుముందు టీయూటీఎఫ్ వ్యవస్థాపకుడు స్వామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిరి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎం.జలంధర్‌రెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బేర దేవన్న, రాష్ట్ర సహాధ్యక్షులు ఆర్.సుజాత, గంద్రత్ నారాయణ, జిల్లా కోశాధికారి మధుసూదన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు వై.రాంరెడ్డి, జిల్లా, మండల నాయకులు వెంకట్‌రావు, గంగాధర్, రవీందర్‌రెడ్డి, అరుణ, కిష్టు, అంబయ్య, భోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉదయం చలి.. మధ్యాహ్నం ఎండ

- జిల్లాలో భిన్నమైన వాతావరణం



చలి మంట కాగుతున్న జనం

కైలాస్‌నగర్: జిల్లాలో రెండు, మూడు రోజులుగా భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం, సాయంత్రం వేళలో తీవ్రమైన చలి ఉండగా, మధ్యాహ్నం ఎండ కాస్తుంది. భిన్న వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేకువజామున వీస్తున్న శీతలగాలుల ప్రజలను వణికిస్తున్నాయి. ఉదయం 10గంటల వరకు ఇదే పరిస్థితి ఉండటంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. సాయంత్రం కూడా ఇదే పరిస్థితి. దీంతో చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. చలి మంటలతో ఉపశమనం పొందుతున్నారు. ముఖ్యంగా వాహనదారులకు ప్రయాణం సాగించడం ఇబ్బందికరంగా మారుతోంది. అలాగే మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఓ వైపు చలి, మరోవైపు ఎండ పరిస్థితులతో జనం అయోమయానికి గురవుతున్నారు.

ఉల్లం'ఘనుల'పై..చీటింగ్

- వాహనాలపై నంబర్‌ప్లేట్ సరిగా లేకుంటే కేసు
- ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై పోలీసుల చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు(ఫైల్)



నంబర్ ప్లేట్‌కు రంగు పూసి ఇలా.. (ఫైల్)



బైక్ నంబర్ ప్లేట్‌పై మాస్క్ వేశారిలా..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో పలువురు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. జరిమానా నుంచి తప్పించుకునేందుకు జిమ్మిక్కులు చేస్తున్నారు. ఈ క్రమంలో నంబర్ ప్లేట్‌ను ఓ వైపు వంచడం,స్టిక్కర్లు వేయడం, ఓ నంబర్‌ను తొలగించడం, ఇంకొంతమంది నంబర్లను దిద్దడం, వాటికి మాస్కులు పెట్టడం, మరికొంతమంది అసలు నంబర్ ప్లేటే లేకుండా తిరిగేస్తున్నారు. అయితే నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు సైతం కొరఢా ఝులిపిస్తున్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. తాజాగా ఆదిలాబాద్ టూటౌన్ పరిధిలో సీఐ తనిఖీలు చేపడుతుండగా పట్టణానికి చెందిన ఓ వ్యక్తి నంబర్ ప్లేట్‌పై బ్లాక్ పెయింట్ వేశాడు. సీఐ ఆ వాహనదారుడిని ఆపి బండి సీజ్ చేసి చీటింగ్ కేసు నమోదు చేశారు.

జరిమానా నుంచి తప్పించుకునేందుకే..

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు పోలీసులు జరిమానా విధిస్తున్నారు. అయితే వీటి నుంచి తప్పించుకునేందుకు పలువురు అడ్డదారుల్లో వెళ్తున్నారు. నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి. ముందు, వెనుక భాగంలో వాహనానికి నంబర్ ప్లేట్లు ఉండాలి. అయితే చాలా మంది ఈ నిబంధనలు పాటించడం లేదు. రాంగ్‌రూట్‌లో వాహనాలను నడిపించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేయడం, ట్రిపుల్ రైడింగ్, మైనర్లకు బైక్‌లు ఇవ్వడం వంటివి చేస్తున్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ట్రాఫిక్ పోలీసులతో పాటు ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. వీటి నుంచి తప్పించుకునేందుకు కొంతమంది వాహనదారులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారు.

నంబర్‌ప్లేట్ లేని వాహనాలతో చోరీలు..

జిల్లాలో కొంతమంది ఇటీవల ద్విచక్ర వాహనాలపై వెళ్లి చోరీలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. వీటితో పాటు ఇతర నేరాలకు పాల్పడిన సమయంలో నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించడం కష్టంగా మారుతుంది. వాహనాలు చోరీకి గురైన సమయంలో నంబర్ ద్వారానే గుర్తించే అవకాశాలు ఉంటాయని పోలీసులు పేర్కొంటున్నారు. చోరీ జరిగిన సమయంలో సీసీ ఫుటేజీలు చూస్తే వాహనాలకు నంబర్ లేటన్లయితే వారిని పట్టుకోవడం కష్టంగా మారుతుంది. వాహనదారులు ఎక్కడివారు, ఏ కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే విషయాలు తెలియకుండా పోతున్నాయి. ఈక్రమంలో పోలీసులు వాహనాలకు తప్పనిసరిగా నంబర్‌ప్లేట్ ఉండాలని సూచిస్తున్నారు. రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులు ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిపైనే తిరుగుతున్నారు. ఈ క్రమంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నంబర్‌ప్లేట్‌ను వంచిన, వాటిపై స్టిక్కర్లు, మాస్కులు పెట్టిన వాహనదారులు పట్టుబడుతున్నారని పోలీసులు పేర్కొంటున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ట్రాఫిక్ నిబంధనల విషయంలో కొంతమంది వాహనదారులు నంబర్‌ప్లేట్ కనిపించకుండా జిమ్మిక్కులు చేస్తున్నారు. నంబర్ ప్లేట్‌ను వంచడం, కొన్ని నంబర్లను తొలగించడం, వంటివి చేస్తున్నట్లు ఇటీవల తనిఖీల్లో గుర్తించాం. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటున్నాం. కేసులు కూడా నమోదు చేస్తున్నాం. త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదు. ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం. ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

క్లుప్తంగా

జింక అప్పగింత



గాయపడిన జింక

బేల: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని మశాల(కె) రెవెన్యూ శివారు అటవీ ప్రాంతం నుంచి బాది గ్రామం వైపునకు ఆదివారం ఓ జింక వచ్చింది. దీనిని పట్టుకున్న గ్రామస్తులు బంజరుదొడ్డిలో వేసి, అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు, ఉపసర్పంచ్ దంతెల వినోద్ కలిసి ఆ జింకను అటవీ బీట్ అధికారి దేవేందర్‌కు అప్పగించారు. ఆ జింకకు వైద్యం అందించి మావల పార్క్‌లో అప్పగించినట్లు ఆ అధికారి తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటారు. కేరళ రాష్ట్రంలోని త్రిస్సూర్‌లో జరిగిన రెండవ ఖేలో ఇండియా ఉమెన్స్ మహిళల జూడో జాతీయ స్థాయి పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. 48 కేజీల విభాగంలో జె.మధులత, 52 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలను సాధించారు. 44 కేజీల విభాగంలో సునీత, 70 కేజీల విభాగంలో ఎస్. శ్రీజ, 57 కేజీల విభాగంలో అలేఖ్యలు రజత పతకాలను గెలుపొందారు. 40 కేజీల విభాగంలో సహస్ర, 57 కేజీల విభాగంలో ఆర్. చాందిని, 40 కేజీల విభాగంలో జే. అభినయలు కాంస్య పతకాలను సాధించారని జూడో కోచ్ రాజు తెలిపారు. క్రీడాకారులను డివైఎస్ఓ వెంకటేశ్వర్లు, ఒలంపిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పార్థసారథి అభినందించారు.

హ్యూమన్ రైట్స్ చీఫ్‌గా డానియెల్



డానియెల్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన బత్తుల డానియెల్‌ను నేషనల్ హ్యూమనిటి, పీస్ రైట్స్ అఫైర్స్ చీఫ్‌గా నియమించారు. తనపై నమ్మకంతో సమాజ శ్రేయస్సు కోసం ఉన్నతమైన బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు నేషనల్ నింబల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ చైర్మన్, సీఈవో డాక్టర్ విజయ్, మోహన్‌రావు, జనరల్ సెక్రటరీ డాక్టర్ కాంతారావు, డైరెక్టర్ ఎగ్జిక్యూటివ్ చీఫ్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌రావు లకు కృతజ్ఞతలు తెలిపారు.



గోల్డెల్ ఓరియోల్(వంగపండు పిట్ట)



వైట్ వాగ్రైల్

పక్షిని కేమరాలో బంధిస్తున్న జేఎన్‌ఏఎఫ్ఏయూ స్టూడెంట్

వీక్షించి.. బంధించి

- కెమెరాలలో భద్రపరచి..
- రెండోరోజు ముగిసిన బర్డ్‌వాక్
- అడవిలోనే బసచేసిన పక్షి ప్రేమికులు

జన్నారం: పక్షులు కిలకిల రాగాలు పలికే... పక్షి మురిసిన క్షణాలు ఎన్నటికీ మరువలేనివని అంటున్నారు పక్షి ప్రేమికులు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో బర్డ్‌వాక్ రెండో రోజు కొనసాగింది. రెండు రోజుల బర్డ్‌వాక్ ఆదివారంతో ముగిసింది. శనివారం రాత్రి జన్నారం డివిజన్‌లోని కామన్‌పల్లి వాచ్‌టవర్, ఘనిషెట్టి కుంటలలో దేరాలు ఏర్పాటు చేశారు. వీటిలో పక్షి ప్రేమికులు బస చేశారు. తెల్లవారు ఆరు గంటలకు కల్పకుంటకు వెళ్లి పక్షుల కిలకిలల మధ్య ఆనందంగా పక్షులను కెమెరాలలో బంధించారు. వాటిని చూసి మురిశారు. అక్కడి నుంచి మైసమ్మ కుంటలో గంటపాటు పక్షులను కెమెరాలలో బంధించారు. వెదురు వంతెన, గడ్డి క్షేత్రాలను పరిశీలించి అక్కడి నుంచి ఘనిషెట్టి కుంటలో అల్పాహారం చేసి, తిరిగి అటవీశాఖ గెస్ట్ హౌజ్‌కు వెళ్లారు. అక్కడ వారి అనుభవాలను అటవీ అధికారులతో పంచుకున్నారు.



పక్షుల ఫొటోలు తీస్తున్న బర్డ్‌వాచర్లు



శాండీపైపర్

ఆనందంగా ఉంది



బర్డ్‌వాక్ ఉందని తెలియగానే ఇక్కడికి వచ్చాను. పేరు నమోదు చేయించుకున్న వారికి అటవీశాఖ వసతులు కల్పించింది. కామన్‌పల్లి వాచ్‌టవర్ వద్ద అటవీశాఖ అధికారులు డేరాలను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి వరకు ఫైర్‌క్యాంప్ పెట్టుకుని డేరాలలో బస చేశాము. తెల్లవారు జామునే కలపకుంటలో పక్షులను గమనించాము. ఇలాంటి చోటుకు రావడం ఆనందంగా ఉంది.

– ఇర్షాద్, చార్టర్డ్ అకౌంటెంట్, హైదరాబాద్

160 రకాల పక్షులను గుర్తించాం



మా పాఠశాల తరుపున ఇక్కడికి వచ్చాము. పక్షులపై మా పాఠశాలలో అవగాహన కల్పించారు. 300 రకాల పక్షుల గురించి తెలుసుకున్నాను. ఇక్కడ రెండు రోజులుగా పక్షులను గమనించాము. 160 రకాల పక్షులను గుర్తించాము. వీటి పేర్లను కూడా చెప్పగలను. రెండు రోజుల పర్యటన అద్భుతంగా ఉంది.

– దీపిక, 9వ తరగతి విద్యార్థిని, కామారెడ్డి

చాల రకాల పక్షులను గమనించాం



బర్డ్‌వాక్‌లో భాగంగా ఇక్కడికి వచ్చాము. ఇప్పటి వరకు రెండు సార్లు బర్డ్‌వాక్‌లో పాల్గొన్నాను. అరుదైన పక్షి జాతులు ఇక్కడ గమనించాము. శీతాకాలంలో రకరకాల పక్షులు ఇక్కడికి చేరుకుంటాయని అధికారులు చెబుతున్నారు. ఐరోపా, ఆసియా ఖండాలలో ఉండే పక్షులను ఇక్కడ చూశాం. బర్డ్‌వాక్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

– కిశోర్, హైదరాబాద్

వన్యప్రాణి మాంసం పట్టివేత



సుభాశ్‌నగర్‌లో తనిఖీలు చేపట్టిన ఎఫ్ఆర్‌వో, సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని సుభాశ్‌నగర్ కాలనీలో వన్యప్రాణి మాంసాన్ని ఆదివారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. కొండగొర్రెను హతమార్చినట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేయగా గడ్డివాములో సుమారు 8కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అనుమానితుడిని అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విషయమై ఎఫ్ఆర్‌వో వినాయక్‌ను వివరణ కోరగా పూర్తి వివరాలు సోమవారం తెలియజేస్తామని తెలిపారు.

కల్పకుంటలో బర్డ్ ఫెస్టివల్



పక్షులను కెమెరాలో బంధిస్తున్న బర్డ్ వాచర్లు

కడెం: అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్ ఫెస్టివల్ ఆదివారం ఉడుంపూర్ అటవీ రేంజ్‌లోని కల్పకుంటలో నిర్వహించారు. బర్డ్ వాచర్లు కల్పకుంట వాచ్‌టవర్, సమీప అటవీ ప్రాంతంలో వివిధ రకాల పక్షులను కెమెరాల్లో బంధించారు. పక్షుల రకాలు, జీవ వైవిధ్యంపై జన్నారం ఎఫ్‌డీవో మాధవరావు వాచర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్వో ప్రకాష్ ఉన్నారు.

ఆదివాసీలకు విద్యను దూరం చేసేందుకు కుట్ర

- భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాపురావు

ఆదిలాబాద్‌టౌన్: ఆదివాసీలకు విద్యను దూరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని భద్రాచలం మాజీ ఎంపీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాపురావు విమర్శించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవన మైదానంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ద్వితీయ మహాసభలను నిర్వహించారు. ఈ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర జరుగుతుందని, ఇందులో భాగంగా నూతన విద్య విధానాన్ని కేంద్రం తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ప్రాథమిక విద్య మాతృభాషలో లేకుండా చేస్తుందని వివరించారు. గిరిజన గూడాల్లో ఉన్న బడుల్లో సమస్యలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రభుత్వాలపై నిరంతరం ఉద్యమిస్తామని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ విద్యను నిర్వీర్యం చేస్తుందని, ఫెలోషిప్‌లో కోతలు విధించడంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అంతకుముందు డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, గిరిజనుల విద్య కోసం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. అదేవిధంగా గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. ఇదిలా ఉండగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. గిరిజన సంప్రదాయబద్ధమైన గుస్సాడీ, తదితర పాటలపై నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, సచిన్, టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీంరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్, ఆయా సంఘాల నాయకులు లంకా రాఘవులు, ఈశ్వర్, సోమేష్, దర్శనాల మల్లేష్, నర్మద, పుష్పలత, మాలశ్రీ, తనుష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాపురావు



గుస్సాడీ నృత్యం చేస్తున్న విద్యార్థులు

హీరాసుక్కా జయంతి అధికారికంగా నిర్వహించాలి

- ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నేతలు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఆరాధ్యదైవమైన హీరా సుక్కా జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు దుర్వ నగేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 28న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న హీరా సుక్కా జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని టీటీడీసీ కార్యాలయంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కులస్తులతో సమాశాన్ని నిర్వహించారు. జయంతి నిర్వహణపై వారివారి అభిప్రాయాలను తెలిపారు. పర్ధాన్ సమాజ్ కులస్తులందరూ ఏకతాటిపై ఉండి జయంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ఆదివాసీ తెగలోని పర్ధాన్ సమాజ్ కులస్తులకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా గుర్తింపు లభించడం లేదని, పోరాటాల ఫలితంగా ఇప్పుడిప్పుడే రాజకీయంగా ప్రభుత్వాలు గుర్తింపును ఇస్తున్నాయన్నారు. సమాజ్‌లోని ఉద్యోగులు, యువకులు, మహిళలు, మేధావులు, ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో ఏన్నాడు లేని విధంగా హీరా సుక్కా జయంతి వేడుకలకు జిల్లాలోని ప్రతి పల్లె నుంచి ఆదివాసీ పర్ధాన్ కులస్తులు వేలాది సంఖ్యలో తరలి వచ్చేలా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోడం వర్ష సునీల్, ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు గోడం గంగారాం, సిడాం పురుషోత్తం, సర్పంచ్ నైతం సీతారాం, వెట్టి మనోజ్, ఉద్యోగులు కొచడ నారాయణ, కుర్సేంగే మహేందర్, నీలకంఠ్, పుర్కే దయానంద్, గేడం లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు దుర్వ నగేశ్

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని హస్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చాందూరి గ్రామంలో హీరాసుక జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులు భొజ్జు పటేల్‌ను శాలువతో సన్మానించారు. కమ్యూనిటీ హాల్‌కు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. నైతం మారుతి, మడావి భీమ్‌రావు, మెస్రం వన్ను, సంతోశ్, భీమ్‌రావు, వెంకటేశ్, సంజీవ్, తులసీరాం, లక్ష్మణ్, మాధవ్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భొజ్జు పటేల్

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి గ్రామానికి చెందిన జంగల్ వెంకట్(40) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... జంగల్ వెంకట్ బీడీ కార్మికుడికిగా పనిచేసేవాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మల్లన్న దేవుని ఆలయాల్లో పూజలు

- ఎల్విలో మల్లయోధులకు కుస్తీ పోటీలు
- మొక్కలు తీర్చుకున్న భక్తులు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తానూరు: మండల కేంద్రమైన తానూరుతో పాటు ఎల్వి గ్రామాల్లోని మల్లన్న దేవున్ని ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. తానూరులోని మల్లన్న దేవున్ని ఆలయంలో మల్లన్న కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. పింటు మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్వి గ్రామంలో భక్తులు ఉదయం పూజలు నిర్వహించి మల్లన్న పల్లకిని గ్రామంలోని ఆయా విధుల గుండా ఊరేగించారు.



పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

మల్లయోధులకు కుస్తీ పోటీలు ...

ఎల్వి గ్రామంలో మల్లయోధులకు గ్రామ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. ముందుగా కుస్తీ పోటీలను గ్రామ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ పోటీల్లో మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మహారాష్ట్రలోని పలు గ్రామాలకు చెందిన మల్లయోధులు పోటీల్లో తలపడ్డారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మల్లయోధులకు బహుమతులను ప్రదానం చేశారు.

కేంద్ర ప్రభుత్వానికి తగినబుద్ధి చెప్పాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

ఖానాపూర్: ఎస్సీవర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రానున్న కాలంలో కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా మాదిగ, మాదిగ ఉపకులాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తుందని మండిపడ్డారు. ఈ నెల 11న ఆదిలాబాద్‌లోని జరిగే కేంద్ర హోంశాఖ మంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ శనిగారపు కమలాకర్, రాష్ట్ర కార్యదర్శి మునుగూరి ప్రణీత్, ఆదిలాబాద్ కన్వీనర్ ఆరెల్లి మల్లేశ్, మంచిర్యాల కన్వీనర్ చెన్నూర్ సమ్మయ్య, కుమురంభీం జిల్లా కన్వీనర్ బ్రహ్మయ్య, నాయకులు అశోక్, శరత్‌కుమార్, కుడాల స్వామి, నంద కుమార్, తుకారాం, బర్ల రాజ్‌కుమార్, సుందిల్ల మల్లేశ్, బైర మధు, కాంబ్లే బాలాజీ, నాగరాజు, గణేశ్, నవీన్, శ్రీనివాస్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

లింబారావుకు న్యాయం జరిగే వరకూ పోరాడుతాం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దౌలత్‌రావు మొకాశి

- ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు మొకాశి

నార్నూర్: అటవీశాఖ అధికారుల దాడిలో గాయపడి ప్రాణప్రాయస్థితిలో ఉన్న మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన కోవ లింబారావుకు పూర్తి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు మొకాశి అన్నారు. ఆదివారం మండలంలోని నాగల్‌కొండ గొండుగూడలో మొత్తం ఐదు ఆదివాసీ గ్రామాల ప్రజలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కోవ లింబారావుపై అటవీశాఖ అధికారుల దాడిపై ఆరా తీశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో జీవనం కొనసాగిస్తున్న ఆదివాసీలపై అటవీశాఖ అధికారులు దాడులు చేస్తూనే ఉన్నారని తెలిపారు. ఆదివాసీలపై దాడులు జరుగుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. అటవీశాఖ దాడిలో గాయపడిన లింబారావు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం శాశ్వత ప్రాతిపదికన ఇవ్వాలని, దాడి చేయించిన అటవీశాఖ అధికారిణిని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. డీఎఫ్‌వో ఇచ్చిన హామీ ప్రకారం కోవ లింబారావుకు మెరుగైన వైద్యం అందలేదని మండిపడ్డారు. కుటుంబంలో ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి పది ఎకరాల భూమిని కలెక్టర్, ఐటీడీఏ పీవోతో మాట్లాడి ఇప్పిస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని అమలయ్యేలా చూడాలని కోరారు. నెలరోజుల్లోగా సమస్యలు, డిమాండ్లను నెరవేర్చకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్‌చార్జి జంగుపటేల్, ఆదివాసీ సేన కేబీ జిల్లా అధ్యక్షుడు కోడప వామన్, ఆదివాసీ నాయకులు ఆత్రం పరమేశ్వర్ కుమ్ర మాన్కు, కోవ మారు పటేల్, తదితరులు పాల్గొన్నారు.



విరబూసిన మామిడి

ఖానాపూర్: గత కొద్ది రోజులుగా అధిక చలి తీవ్రత కారణంగా మామిడి చెట్లతో పాటు చింతచెట్లు విరబూశాయి. గత ఏడాది అంతంత మాత్రంగానే కాత ఉండడంతో మామిడి, చింత కాయల కొరత మార్కెట్‌లో కనిపించింది. ఈసారి ఈదురు గాలులు రాకుంటే కాతనిలిచి విరివిగా కాయలు కాసే అవకాశం లేకపోలేదు.